అమ్మల ఆశలపై నీళ్లు

- 'తల్లికి వందనం' అందజేతలో మెలిక
- పిల్లల్లో ఒక్కరికే రూ.15 వేలు ఇస్తామని మార్గదర్శకాలు జారీ
- మాట మార్చిన కూటమి ప్రభుత్వం
- అందరికీ అమలు చేయాలని విద్యార్థుల తల్లుల డిమాండ్

తల్లికి వందనమంటూ సీఎం చంద్రబాబు వారి ఆశలపై నీళ్లు జల్లుతున్నారు. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం పేరిట ఏడాదికి రూ.15 వేల చొప్పున.. ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ అందజేస్తామని చెప్పిన నూతన కూటమి ప్రభుత్వం మాట మార్చింది. చంద్రబాబు ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి తనకు తెలిసిన విద్యలన్నీ ప్రదర్శిస్తోంది. ప్రతి పథకానికి ఏదొక మెలిక పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకునే చాకచక్యానికి సిద్ధమైంది. – విశాఖ విద్య/గోపాలపట్నం/మల్కాపురం/కంచరపాలెం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద ప్రజల చదువుకు భరోసా ఇవ్వడానికి అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టింది. తమ పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులకు ఎటువంటి భారం లేకుండా అవసరమైన ఆర్థిక సాయం అందించాలనే గొప్ప లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టి ఇంట్లో ఒకరికి ఏడాదికి రూ.15,000 ఇచ్చింది. ఆ విద్యార్థి చదువుతున్న యాజమాన్యంతో పనిలేకుండా ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది. దీంతో పాటు జగనన్న విద్యా కానుక ద్వారా కిట్లు పంపిణీ చేయడం వల్ల కనీసం పైసా ఖర్చు లేకుండా పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకోగలిగారు. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నేతలు తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అందరికీ రూ.15,000 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్త జీవోలో ఈ ప్రస్తావన ఎక్కడా లేదు. దీంతో కేవలం ఒక పిల్లవాడికే తల్లికి వందనం ఇస్తారనే అనుమానాలు ప్రజల్లో రేకెత్తిస్తున్నాయి. ఈ నెల నుంచే ఇంట్లో చదువుకుంటున్న అందరు పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఇద్దరు పిల్లల్ని కష్టపడి చదివిస్తున్నా..



నాకు ఇద్దరు కొడుకులు. భర్త లేడు. ఎంపీపీ స్కూల్‌లో ఒక బాబు నాలుగో తరగతి, మరో బాబు రెండో తరగతి చదువుతున్నాడు. ఇస్త్రీ దుకాణంతో కుటుంబాన్ని నడుపుతున్నాను. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పేరుతో రూ.15,000 చొప్పున ఇస్తామని చంద్రబాబు చెప్పారు. అలాగైతే నాకు ఏడాదికి రూ.30 వేలు వస్తాయి. నా కష్టాలు తీరుతాయి. కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి.

– పి.రమాదేవి, చిన్న బుచ్చిరాజుపాలెం

పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేదు



మాకు పాప, బాబు ఉన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం పేరిట రూ.15 వేలు ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో హామీ ఇవ్వడంతో మా పిల్లలను ప్రైవేటు స్కూల్‌లో చేరి్పంచాం. ఇప్పటి వరకు నా ఖాతాలో డబ్బులు పడకపోవడంతో పిల్లల ఫీజులు చెల్లించలేదు. జ్ఞానాపురం ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం ఇబ్బంది పెడుతున్నారు. తల్లికి వందనం డబ్బుల కోసం తల్లులు ఎదురుచుస్తున్నారు.

– కంచిపాటి రూత్‌మేరీ, కంచరపాలెం

అప్పు చేసి ఫీజులు కట్టాం



మాకు పాప, బాబు ఉన్నారు. ఇద్దరినీ జ్ఞానాపురం స్కూల్‌లో చదివిస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తున్నా.. తల్లికి వందనం జాడ మాత్రం కనిపించలేదు. దీంతో అప్పు చేసి మా పిల్లల స్కూల్ ఫీజులు కట్టాం. స్టూడెంట్ కిట్లు అసంపూర్తిగానే పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో విద్యా కానుకలు పాఠశాలలు తెరిచిన వారంలోనే మా పిల్లలకు అందించేవారు. నెల రోజుల్లోనే అమ్మ ఒడి పేరిట తల్లి ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారు. తల్లికి వందనం పేరిట ఖాతాల్లో డబ్బులు వేయడంలో మార్గదర్శకాల పేరిట తాత్సారం చేస్తున్నారు.

– పి.శ్యామల, కంచరపాలెం

ఈ ఏడాది ఇంకా డబ్బులు పడలేదు



మా బాబు లక్ష్మీనగర్ జీవీఎంసీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. పోయిన ఏడాది వరకు అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. ఈ ఏడాది ఇంకా డబ్బులు రాలేదు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం పిల్లోడి చదువుకు ఎంతో ఉపయోగపడుతుంది. కొత్త ప్రభుత్వం తల్లికి వందనం అని డబ్బులు ఇస్తారని మా కాలనీలో చెబుతున్నారు. ఆ డబ్బులు సకాలంలో ఇస్తే, పిల్లల అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయి. ప్రభుత్వం వెంటనే డబ్బులు మంజూరు చేస్తుందని చూస్తున్నాం.

– చెంచల కళ, లక్ష్మీనగర్, 90వ వార్డు

ఒక్కరికే పథకం ఇస్తామనడం తగదు



మాకు ఇద్దరు ఆడపిల్లలు. వారిని చదివించుకోవడానికి తల్లికి వందనం పథకం చాలా ఉపయోగపడుతుందని ఆశపడుతున్నాను. కానీ కూటమి ప్రభుత్వం ఒక్కరికే పథకం వర్తిస్తుందని అనడంతో ఆందోళనగా ఉంది. తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామనడంతో మా సమస్యలు తొలగి, పిల్లలను చక్కగా చదివించుకోవచ్చని ఆశపడుతున్నాం. కూటమి ప్రభుత్వం తన హామీ నెరవేర్చాలి.

– డి.వసంతలక్ష్మి, అశోక్‌నగర్, 60వ వార్డు

క్లుప్తంగా

జీవీఎంసీ షెల్టర్‌లో వృద్ధుడికి ఆశ్రయం



వృద్ధుడి వివరాలు తెలుసుకుంటున్న మమత

విశాఖ విద్య: నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుడికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. కాన్వెంట్ జంక్షన్ బస్ షెల్టర్ వద్ద ఒక వ్యక్తి ఫుట్‌పాత్ మీద ఆశ్రయం లేక నిస్సహాయ స్థితిలో ఉన్నాడని గురువారం కంచరపాలెం కానిస్టేబుల్ రాంబాబు ఇచ్చిన సమాచారంతో షెల్టర్ మేనేజర్ మమత అక్కడికి వెళ్లారు.ఆ వ్యక్తికి సపర్యలు చేసి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌కి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. ఇతడికి తెలుగు రాకపోవడంతో వివరాలు ఏమీ చెప్పలేకపోతున్నాడు. త్వరలోనే అతడి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని అప్పగించే ప్రయత్నం చేస్తామని మేనేజర్ మమత తెలిపారు.

నేటి నుంచి బియ్యం, కందిపప్పు విక్రయాలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని రైతుబజార్‌లో శుక్రవారం నుంచి తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నట్టు ఎస్టేట్ ఆఫీసర్ జైసింహ గురువారం తెలిపారు. రైతుబజార్‌లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఎమ్మెల్యే పి.గణబాబు చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. స్టీమ్ రైస్ (సోనామసూరి(బీపీటీ) కేజీ రూ.49, రా రైస్(సోనామసూరి) కేజీ రూ.48, కందిపప్పు(దేశవాలీ) రూ.160 చొప్పున విక్రయిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విక్రయాలు సాగుతాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.

రైల్వే స్టేషన్ నుంచి గంభీరంకు సిటీ బస్సు సౌకర్యం

దాబాగార్డెన్స్: భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ గంభీరంకు రూట్ నంబరు 25–ఐఐఎమ్ సిటీ బస్సు సౌకర్యం కల్పించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. ఈ బస్సు రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం, హనుమంతువాక, మధురవాడ, మారికవలస మీదుగా ఐఐఎంకి చేరునని తెలిపారు.

రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరు సమయం..
ఉదయం 07:30, 10:20 మధ్యాహ్నం ఒంటిగంటకు..

ఐఐఎం నుంచి బయలుదేరు సమయం:
ఉదయం 08:55, 11:35, మధ్యాహ్నం 14.30, 18:15.

సింహాచలం రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ మాక్‌డ్రిల్



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో సంఘ విద్రోహ శక్తులు దాడులు చేయకుండా ముందుగా ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న కోణంలో డ్రిల్ చేశారు. రైల్వే స్టేషన్‌లోకి వెళ్లే మార్గంలో ప్రతీ వ్యక్తిని నిశితంగా పరిశీలించారు. వారి బ్యాగులు చెక్ చేసి లోపలికి పంపించారు. ప్లాట్ ఫారాలపై, చంద్రగనర్ వైపు ప్రత్యేక నిఘా పెట్టారు. చివరికి స్టేషన్‌లో బాంబ్ పెట్టేందుకు యత్నించిన వ్యక్తులను పట్టుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు, డాగ్‌స్క్వాడ్ విభాగం, జీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్కార కార్యక్రమానికి తరలిరండి

మల్కాపురం: ఈ నెల 14న ఆదివారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు యాదవ్, గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌లను విశాఖ జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో సత్కరించనున్నట్లు సంఘ ఉపాధ్యక్షుడు పుర్రె అప్పారావు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల గల యాదవ వర్గీయులంతా తప్పక హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. 59వ వార్డు పాత చెక్‌పోస్ట్ ఏరియా వద్ద గల ఆయన నివాసంలో గురువారం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గడిచిన ఎన్నికల్లో ఘన విజయాన్ని అందుకున్న యాదవ సోదరులకు తమ వంతుగా చిరు సత్కారం చేస్తున్నామని అప్పారావు యాదవ్ చెప్పారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న రమణ తదితరులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డుకు చెందిన గాయత్రి అనే వృద్ధ బ్రాహ్మణ యాచకుడు వయస్సు రీత్యా అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు మృతుడి సంబంధీకుల గురించి వాకబు చేయగా.. ఎవరు లేరని తెలింది. దీంతో వారు 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణను సంప్రదించగా మానవతా దృక్పథంతో ఆయన అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నానాజీ, కానిస్టేబుల్ రాంబాబు, అప్పల కృష్ణ, ప్లంబర్ శంకర్, గోపీ, పోతల సతీష్, బొత్సా రాజు, నరసింహ పాల్గొన్నారు.

బియ్యం, కందిపప్పు విక్రయాలు ప్రారంభం



గోపాలపట్నం రైతుబజారులో వినియోగదారులకు కందిపప్పు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజారులో సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం, కందిపప్పు అమ్మకాల కౌంటర్‌ను గురువారం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజారుల్లో, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల్లో బియ్యం కందిపప్పు దొరుకుతుందని తెలిపారు. బయట మార్కెట్ ధర కంటే తక్కువకు అందిస్తున్నామన్నారు. కందిపప్పు కిలో రూ.160, స్టీమ్డ్ బీపీటీ బియ్యం కిలో రూ.49, రా బియ్యం రూ.48కు అందిస్తున్నామని చెప్పారు. రైతుబజారుల్లో ఉన్న సూపర్ బజారుల్లో ఇవి అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మర్రిపాలెం రైతుబజారులో..

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజారులో సబ్సిడీపై కందిపప్పు, బియ్యం విక్రయించే స్టాల్‌ను గురువారం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. వినియోగదారులకు ఆయన చేతుల మీదుగా బియ్యం, కందిపప్పు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినియోగదారులకు తక్కువ ధరకే నిత్యావసర సరకులు అందించేలా రైతుబజార్లలో ఇటువంటి ఏర్పాట్లు చేశామన్నారు. రైతుబజారు ఈవో కొమ్మనాపల్లి వరహాలు పాల్గొన్నారు.

రెండో శనివారం స్కూళ్లకు సెలవు ఇవ్వాలి

విశాఖ విద్య: రెండో శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు తప్పనిసరిగా సెలవు ప్రకటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి. సీతారాం ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రతీ నెలా రెండో శనివారం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యా క్యాలెండర్ పనిదినాలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలకు సిఫార్స్ చేస్తామన్నారు. జిల్లాలో రెండో శనివారం, లేదా ఆదివారం రోజుల్లో ఎక్కడైనా స్కూళ్లు తెరిచి, తరగతులు నిర్వహించినట్లెతై తల్లిదండ్రులు కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు



ఎ.నందగణేష్ ఎల్.ప్రసన్న బి.భవ్యశ్రీ

గోపాలపట్నం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రతిష్టాత్మకమైన నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు సంపాదించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎ.నందగణేష్– నూజివీడు ట్రిపుల్‌ఐటీల్లో సీటు పొందాడు. గోపాలపట్నం బాలికల ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఎల్.ప్రసన్న ఒంగోలు, బి.భవ్యశ్రీ– ఒంగోలు, కె.గీత– నూజివీడు ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు సాధించారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్న పలు పాఠశాలల నుంచి మొత్తంగా 8 మంది విద్యార్థులు ఐఐఐటీకి ఎంపికయ్యారు. తాము ఇంజినీరింగ్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంటామని, పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తామని చెబుతున్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



కె.గీత అల్లు జశ్వంత్ శ్రీశాంత్



బుగత హర్షిత నిఖిల్

విద్యార్థుల తల్లిదండ్రుల సంతోషం

మల్కాపురం: మల్కాపురంలోని ప్రకాష్‌నగర్ జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. అల్లు జశ్వంత్, శ్రీశాంత్ డోలాయి నూజివీడులో సీట్లు సాధించగా.. బుగత హర్షిత, నిఖిల్ శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ ఇందుకు కారణమైన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్‌బీసీ బ్రిడ్జి మీదుగా వాహనాలను అనుమతించాలి



మల్కాపురం బస్‌స్టాప్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: ప్రత్యామ్నాయం చూపకుండా ఎస్‌బీసీ వద్ద గల డాక్‌యార్డ్ బ్రిడ్జిని మూసివేస్తామనడం సరికాదని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నేవల్ డాక్‌యార్డ్ పక్కన గల షిప్ బిల్డింగ్ సెంటర్(ఎస్‌బీసీ)కు అతి సమీపాన గల సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను మూసివేయాలని అధికారులు చూస్తున్నారు. దీనిలో భాగంగా బ్రిడ్జికి మరమ్మతుల చేసేందుకు దానిపై నుంచి ఎటువంటి వాహనాలను అనుమతించమంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిపై సీపీఎం నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం మల్కాపురం బస్‌స్టాప్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ డాక్‌యార్డ్ వద్ద గల వంతెనకు మరమ్మతులు చేయడం మంచిదే కానీ.. ఇటుగా వచ్చే వాహనాలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఆకస్మాతుగా ఇలాంటి నిర్ణయం తీసుకుంటే వాహనదారుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా తదితర ప్రాంతాలవాసులు, ఉద్యోగులు, విద్యార్థులు అటు నగరంలోకి.. ఇటు డాక్‌యార్డ్, ఎస్‌బీసీ, ఎస్ఆర్ వంటి పరిశ్రమలకు నిత్యం ఈ వంతెన మీదగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. ఇప్పుడు ఈ బ్రిడ్జిని మూసివేస్తే సమయం వృథా కావడంతోపాటు వారికి ఇబ్బందులు తప్పవని చెప్పారు. అధికారులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని వాహన చోదకులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

విశాఖ విద్య: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా గురువారం బుచ్చిరాజుపాలెంలో అవగాహన ప్రదర్శన చేశారు. బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు రొంగలి రేవతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అంతా ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ డెంగీ, మలేరియా వంటి వ్యాధులపై ప్రజలకు తగిన కలిగించేలా వైద్య సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతి నగర్, అప్పర్ జయప్రకాష్ నగర్, బాబూజీ నగర్, తిక్కవానిపాలెం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్స్, పెద కొత్తూరు, ఏఎస్సార్ నగర్, జయప్రకాష్‌నగర్, సురేష్ రామ్‌నగర్, జగ్గీవన్ నగర్, అంబేడ్కర్ నగర్, ఇందిరానగర్ 1–5 ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం



నరవలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: నరవ బెహరా కళాశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నరవ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బెహరా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ జనాభా బిలియన్లు దాటిందని తెలిపారు. ఈ జనాభా ఇలా పెరిగితే భవిష్యత్తు తరాలకు పెనుభారంగా మారుతుందని, అస్థిరత్వం ఏర్పడుతుందన్నారు. జనాభా పెరుగుదలను నియంత్రించాలని, భవిష్యత్తు తరాల మనుగడకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెహరా కళాశాలల ప్రిన్సిపాళ్లు దివ్యశ్రీ, అనుషా ప్రియ, అధ్యాపకులు హెటీన, నీరజ, వాసవి, శ్రద్ధ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో వారాహి హోమం

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో ఈ నెల 6 నుంచి జరుగుతున్న వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా గురువారం సాయంత్రం వారాహి హోమం నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేద మంత్రాల మధ్యం శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. పలువురు భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముందుగా వారాహి దేవికి సహస్ర నామార్చన చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 15వ తేదీతో పీఠంలో నవరాత్రులు ముగుస్తాయని ఆయన తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేంపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంజేంపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేణపూజ, పుణ్యావావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించాయ. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

మెరుగైన వైద్యం అందించేలా సాయం



పద్మను పరామర్శిస్తున్న జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ రజక వీధిలో నివసిస్తున్న కొడమంచిలి పద్మను గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతుండగా.. అవసరమైన ఆర్థిక సాయాన్ని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ద్వారా అందించారు. ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగానే ఉందని పద్మ తెలిపారు. తన వైద్యానికి సాయం అందించనందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గిరిప్రదక్షిణ రోడ్డు శుభ్రం

మర్రిపాలెం: ఈ నెల 20న సింహాచలం గిరిప్రదక్షిణను పురస్కరించుకుని మాధవధార మాధవ స్వామి ఆలయానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం, డెబ్రిస్‌ను గురువారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ పనులను 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా రహదారిని శుభ్రం చేయించినట్టు ఆయన తెలిపారు.

మర్రిపాలెం రైతుబజారులో అధికారుల తనిఖీలు



రైస్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజారులో గురువారం లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కలెక్టర్ కె.థామస్ రవికుమార్ తనిఖీలు నిర్వహించారు. రైతుబజారులో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు కౌంటర్‌ను పరిశీలించారు. ప్రత్యేక కౌంటర్‌లోని వస్తువులు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూనికలు, కొలతల్లో తేడా లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల అవసరాల మేరకు సరకులు అందించాలన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పించాలని సూచించారు. సీఎల్‌ం అప్పలరాజు, ఇన్‌స్పెక్టర్ రామారావు, ఏఎస్‌వో మురళీనాథ్, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ కోమలి, రైతుబజారు ఈవో కొమ్మనాపల్లి వరహాలు తదితరులు పాల్గొన్నారు.